@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శనివారం 29, జూన్ 2024 || పేజిలు: 04



## పీవీకి సీఎం రేవంత్ నివాళులు

- మంత్రులు భట్టి, ఉత్తమ్ శ్రద్ధాంజలి..

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్28:**

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పి.వి. చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావుకు దక్కుతుందని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మిగతా 2లో..

## గరిష్టంగా రూ.2లక్షలు

# రుణమాఫీ

### బంగారంపై అప్పులకు ఇది వర్తించదని స్పష్టం

- పంట రుణమాఫీకి ఇదే ప్రాతిపదిక
- 3, 4 రోజుల్లో మార్గదర్శకాలు
- దీని తర్వాతే రూ.4వేల పింఛనుపై దృష్టి
- కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన వారికే మంత్రివర్గంలో చోటు..
- రుణాల రీస్ట్రక్చర్‌తో వడ్డీ భారం తగ్గించుకుంటాం
- మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి



**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్ 28:**

రైతు రుణమాఫీ ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా రూ.2లక్షల వరకు అమలు చేస్తామని.. దీనిపై 2-3రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే, బంగారం తాకట్టు రుణాలు దీని పరిధిలోకి రావని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకంపై పార్టీ పెద్దలతో చర్చించేందుకు ఢిల్లీలో ఉన్న ఆయన.. శుక్రవారం తన అధికారిక నివాసంలో మీడియాతో మాట్లాడారు. పట్టాదారు పాస్‌పుస్తకాల ఆధారంగా పంట మిగతా 2లో..



## బీఆర్ఎస్‌కు మరో బిగ్‌షాక్

### కాంగ్రెస్ గూటికి చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య..

### కండువా కప్పి ఆహ్వానించిన సీఎం

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ/రంగారెడ్డి-జూన్ 28:**

**ఎమ్మెల్యేలు చేజారకుండా బీఆర్ఎస్ అధినాయకత్వం** ఓవైపు ప్రయత్నాలు చేస్తున్నా.. మరో ఎమ్మెల్యే ఆ పార్టీకి షాకిచ్చారు. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శుక్రవారం కాంగ్రెసలో చేరారు. ఢిల్లీలో.. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో యాదయ్యను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. సాయంత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వద్దకు తీసుకెళ్లి పరిచయం చేశారు. ప్రభుత్వ సుస్థిరతకు ఎమ్మెల్యేల చేరికలు అవసరమంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించి మిగతా 2లో..



## వరంగల్‌లో నేడు సీఎం రేవంత్ పర్యటన

- మెడికవర్ ఆస్పత్రి ప్రారంభోత్సవం
- పలు అభివృద్ధి పనులపై సమీక్షలు

2



## నీట్‌పై దద్దరిల్లిన పార్లమెంటు

2

- నీట్‌పై చర్చకు విపక్షాల డిమాండ్.. నిరాకరించిన అధికారపక్షం..
- రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు
- పలుమార్లు ఉభయసభలు వాయిదా



## అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా

2

- సీఎం సమక్షంలో పార్టీ కండువా..
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

# ఢిల్లీ మునక

- ఎంపీల నివాసాల్లోకీ నీళ్లు.. ఎంపీ రాంగోపాల్
- వరదలో చిక్కుకున్న ట్రావెల్ బస్సు..
- లైఫ్ జాకెట్లతో బయటపడ్డ ప్రయాణికులు

### 24 గంటల్లో 22.81 సెంటీమీటర్ల వర్షం..

### 88 ఏళ్లలో ఇదే అత్యధిక వర్షాపాతం

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ, జూన్ 28:**

మొన్నటిదాక నీటి కొరతతో అల్లాడిన ఢిల్లీ నేడు భారీ వర్షాలతో అతలాకుతలం అవుతోంది..! రికార్డు స్థాయి వర్షపాతంతో దేశ రాజధాని ప్రాంతం మోకాలు లోతు నీటిలో మునిగింది..! ఇళ్లలోకి.. రోడ్లపైన వరద.. ఎక్కడికక్కడ భారీగా ట్రాఫిక్ జామ్‌లు.. విద్యుత్తు సరఫరా నిలిపివేతతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది..! సప్దర్ జంగ్‌లో గురువారం మిగతా 2లో..




## ఘోర ప్రమాదం

- గ్లాస్ తయారీ పరిశ్రమలో ఆటోక్లేవ్ యూనిట్ వద్ద పేలిన బాయిలర్
- పేలుడు ధాటికి ఐదుగురు మృతి
- మరో 13 మందికి తీవ్రగాయాలు
- చెల్లాచెదురుగా మృతదేహాలు..
- షాద్‌నగర్ పరిధిలో ఘటన
- ప్రమాద ఘటనపై సీఎం ఆరా..

వివరాలు 02లో..





## కుక్కలదాడిలో బాలుడి మృతి

- సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో ఘటన
- ముత్తంగిలో 8 నెలల పాపపై..

**పటాన్‌చెరు టౌన్:**

బహిర్భూమికి వెళ్లిన ఆరేళ్ల బా లుడిపై కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన బాల్కన్, మిగతా 2లో..

నేటి ఫోకస్ న్యూస్
శనివారం 29, జూన్ 2024

# బీఆర్ఎస్‌కు మరో షాక్!

(మొదటి పేజీ తరువాయి..)

24 గంటలు గడవక ముందే యాదయ్య చేరిక చోటుచేసుకోవడం గమనార్హం. కాగా, ఎమ్మెల్యే యాదయ్య చేరిక విషయాన్ని కాంగ్రెస్ నాయకత్వం చివరి దాకా గోప్యంగా ఉంచింది. యాదయ్య పార్టీ మారతారంటూ గత కొంతకాలంగా ఊహాగానాలు వెలువడుతున్నా ఆయన ఖండిస్తూ వచ్చారు. కానీ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నగర శివారు ఎమ్మెల్యేలతో ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన భేటీకి యాదయ్య దూరంగా ఉన్నారు. అయితే ఆ రోజు వికారాబాద్‌లో జిల్లా పరిషత్ భవన సముదాయం ప్రారంభానికి హాజరైనందున వెళ్లలేదని ఆయన చెప్పారు. ఈ ప్రారంభోత్సవ సభలో యాదయ్య మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో నిధుల విషయంలో స్వల్పంగా ఘర్షణ కూడా పడ్డారు. దీంతో యాదయ్య పార్టీ మార్పు ప్రచారంపై ఎవరికీ అనుమానం కూడా రాలేదు. కానీ, మూడు రోజుల్లోనే ఆయన హస్తం గూటికి చేరి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. యాదయ్య చేరిక సమయంలో ఆయన వెంట మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కూడా ఉన్నారు. కాలె యాదయ్య తొలిసారిగా 2014లో చేవెళ్ల నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తరువాత ఆయన బీఆర్ఎసలో చేరారు. 2019, 2023 ఎన్నికల్లో కారు గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. మళ్లీ దాదాపు దశాబ్ద కాలం తరువాత తిరిగి సొంత గూటికి చేరుకున్నారు.

# పీవీకి సిఎం రేవంత్ నివాళులు

(మొదటి పేజీ తరువాయి..)

ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పి.వి. చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి పి.వి. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇదిలావుంటే పీవీ స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం పనిచేస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పీవీ జయంతి  సందర్భంగా నివాళి అర్పించారు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, గడ్డం వంశీకృష్ణ, జైవీర్ రెడ్డి, చామల కిరణ్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ వంశీకృష్ణ.. దేశ అభ్యున్నతికి పీవీ సంస్కరణలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. పీవీ నరసింహారావు కేబినెట్ లో కాకా కేంద్రమంత్రిగా దేశాభివృద్ధిలో భాగం అయ్యారని తెలిపారు. ఆ రోజుల్లో ప్రతిపక్షాలు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చేవారని..ఇపుడు స్పీకర్ ఓం బిర్లా నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేలా స్పీకర్ చర్యలున్నాయన్నారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు పార్లమెంట్ లో కొట్లాడుతామన్నారు  ఎంపీ  వంశీకృష్ణ. నీట్ పేపర్ లికేజ్ పై చర్చ చేపట్టాలంటూ విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్ చేస్తూ లోక్ సభ వెల్ లో ఆందోళనలు  చేశామన్నారు.దేశం అత్యంత క్లిష్ట సమయంలో ఉన్న దశలో దేశానికి ఒక దిశను చూపించిన వ్యక్తి పీవీ నరసింహారావు అని ఎంపీ మల్లు రవి అన్నారు.  ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ తో కలిసి వ్యవస్థను గాడిలో పెట్టి, సంస్కరణలను అమలు చేసి భారత్ ను ప్రపంచ దేశాల సరసన నిలిపారన్నారు. ఆయనతో పనిచేసే అవకాశం  దక్కడం తన  అదృష్టమన్నారు.

# కుక్కలదాడిలో బాలుడి మృతి

(మొదటి పేజీ తరువాయి..)

ప్రమీల దంపతులు బతుకుదెరువు కోసం నెల రోజుల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు వలస వచ్చారు. వీరికి ము గ్గురు సంతానం. ఇద్దరిని స్వగ్రామంలో ఉంచి చిన్న కుమారుడు బిశాల్ (6)ను తమ వెంట తీసుకొచ్చారు. ఓ వెంచర్ వద్ద మేస్త్రీ కింద భార్యాభర్త లు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా రు. ఈ క్రమంలో శు క్రవారం ఉదయం బిశాల్ బహిర్భూమికి వెళ్లాడు. అదే సమయంలో నాలు గు కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేశాయి. మెడపై శరీర భాగాలపై తీవ్రంగా గాయాలు కావడంతో బాలుడు మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**ముత్తంగిలో 8 నెలల పాపపై.. :** పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్తంగిలో ఎనిమిది నెలల పాపపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గోకిరం, రోట్న దంపతులు బతుకుదెరువు కోసం ముత్తంగి నాగార్జున కాలనీకి వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం భార్యాభర్తలిద్దరూ స్వాతి (8 నెలలు)ని పడుకోబెట్టి పక్కనే పని చేసుకుంటున్నారు. అటుగా వచ్చిన కుక్క పాపను కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంత రం చిన్నారిని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు.

# టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్ 28:**

తెలంగాణ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శు క్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విడుదలయ్యాయి. సప్లిమెంటరీ ఫలితాల్లో 73.03 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షలకు 51,272 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, 46,731 మంది హాజరయ్యారు. వీరిలో 34,126 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 71.01 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, బాలికలు 76.37 శాతం ఉత్తీర్ణత సాధించి తమ సత్తా చాటారు. బాలుర కంటే బాలికలు 5.36 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదు చేశారు. నిర్మల్ జిల్లా 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. వికారాబాద్ జిల్లా 42.14 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి చివరి స్థానంలో నిలిచింది. ఫలితాల కోసం ఈ వెబ్‌సైట్‌ను క్లిక్ చేయొచ్చు. రీకౌంటింగ్ చేయించాలనుకునే విద్యార్థులు ఒక్కో స్జబెక్ట్‌కు రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. రీకౌంటింగ్ కోసం జులై 8వ తేదీ లోపు ఎస్బీఐ బ్యాంక్ ద్వారా చలాన్ చెల్లించాలి. ఆ చలాన్‌తో పాటు దరఖాస్తును ఎస్సెస్సీ బోర్డులో సమర్పించాలి. డిమాండ్ డ్రాఫ్టలు అంగీకరించబడవు అని అధికారులు స్పష్టం చేశారు.

# గరిష్ఠంగా రూ.2లక్షలు రుణమాఫీ

(మొదటి పేజీ తరువాయి..)

రుణాలను లెక్కిస్తామన్న సీఎం.. ఒక కుటుంబంలో గరిష్ఠంగా రూ.2లక్షల వరకే మాఫీ వర్తిస్తుందన్నారు. మంత్రివర్గ విస్తరణపై చర్చలు ప్రారంభమయ్యాయి. మొత్తం ఆరు పదవులను భర్తీ చేయాలా? లేదా? అనేది పరిశీలిస్తాం. పీసీసీ అధ్యక్ష నియామకం, మంత్రివర్గ విస్తరణ అన్నీ ఒకేసారి పూర్తి చేస్తాం. మంత్రులు, పీసీసీ పదవి విషయంలో సామాజిక న్యాయం పాటిస్తాం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు 50% పదవులు ఉండాలన్నది కాంగ్రెస్ నిబంధన. పార్టీలో కొత్తగా చేరిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఉండవు. కాంగ్రెస్ బీ ఫాంపై గెలిచినవారికే ఇస్తాం. పీసీసీ అధ్యక్ష పదవి మహిళలకు ఇవ్వాలా? ఇప్పటికే పదవిలో ఉన్న వారికి ఇవ్వాలా? అనే అంశాలపై చర్చించలేదు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుల పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుంది. కొత్త సభ్యులను నియమించాక కులగణన మొదలుపెడతాం.

**కేంద్ర బడ్జెట్ తర్వాతే రాష్ట్రంలో..**

కేంద్ర బడ్జెట్ పెట్టిన ఒకట్రెండు రోజుల్లోనే రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభిస్తాం. గత బడ్జెట్‌లో చెప్పిన రాబడిలో 60 శాతమే వచ్చింది. 40% కాగితాలకే పరిమితమైంది. ఇలా అబద్ధాలు చెప్పడం వల్ల ప్రయోజనం ఉండదు. అందుకే వాస్తవ అంచనాలతో బడ్జెట్ రూపొందించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. రాష్ట్ర రుణాలను రీస్ట్రక్చర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. దీనిపై ఇదివరకే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడాం. ఎన్నికలు రావడంతో ఆ చర్చలు ఆగిపోయాయి. ఇప్పుడు మళ్లీ మొదలుపెట్టాల్సి ఉంది. తక్కువ వడ్డీకి కొత్త అప్పులు తీసుకొని ఎక్కువ వడ్డీకి తెచ్చిన రుణాలను చెల్లించాలనుకుంటున్నాం. ప్రస్తుతం రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పుంది. పెండింగ్ బిల్లులు రూ.లక్ష కోట్లు ఉన్నాయి. అప్పులపై 1% వడ్డీ భారం తగ్గినా ఏడాదికి రూ.7 వేల కోట్లు ఆదా అవుతుంది. రాష్ట్రం ఏర్పడిన 2014లో రుణాల చెల్లింపు మొత్తం ఏడాదికి రూ.6,500 కోట్లు ఉంటే ఇప్పుడు నెలకే రూ.7 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోంది.

**ఉపసంఘం సిఫార్సుల మేరకు రైతు భరోసా..**

రైతుభరోసా పథకం విధివిధానాలపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం చేసే సిఫార్సులపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రైతుబంధు కింద కేసీఆర్ రూ.75 వేల కోట్లు ఇస్తే అందులో రూ.25 వేల కోట్లు అనర్హులకే వెళ్లింది. వారి నుంచి రికవరీ చేయడం గురించి ఆలోచించడంలేదు. ధరణి లోపాలను సరిదిద్దే పని జరుగుతోంది. దాని స్థానంలో భూభారతి వస్తుంది. మహిళలకు ఉచిత బస్సు పథకానికి ప్రభుత్వం ప్రతినెలా రూ.350 కోట్లు చెల్లిస్తున్నందున ఆర్టీసీకి ఆదాయం పెరిగి నష్టాలు లేని స్థితికి చేరింది. త్వరలో లాభాల్లోకి వస్తుంది. ఆక్యుపెన్సీ 80%కి పెరిగింది. ఉచిత బస్సు సౌకర్యం వల్ల చాలామంది మహిళలు పుణ్యక్షేత్రాలకు వెళు తుండడంతో ఆలయాల ఆదాయం పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలను అనవసర ఖర్చుగా పరిగణించకూడదు. మోదీ ఈ పదేళ్లలో కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీ చేశారు. దాంతో పోలిస్తే ఉచిత పథకాల కింద ప్రజలకు అందిస్తున్నందెంత? కార్పొరేట్ సంస్థలకు మాఫీ చేస్తే ప్రోత్సాహకం, పేదలు, రైతులకు ఇస్తే సబ్సిడీ అంటున్నారు. ఇది చూసే కోణాన్ని బట్టి ఉంటుంది.

# ఢిల్లీ మునక!

(మొదటి పేజీ తరువాయి..)

ఉదయం 8.30 నుంచి 24 గంటల వ్యవధిలో 22.81 సెంటీమీటర్ల వర్షం కురిసింది. 1936 తర్వాత ఇదే అత్యధికం కావడం గమనార్హం. ఆ ఏడాది జూన్‌లో ఒక్క రోజులో 23.55 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కాగా, గురువారం రాత్రి 3 గంటల్లోనే 14.85 సెంటీమీటర్ల వాన పడింది. జూన్ నెలలో ఢిల్లీ సగటు వర్షపాతం 8.60 సెంటీమీటర్లు మాత్రమే. తాజాగా దీనికి మూడు రెట్లు వాన ఒక్క రోజులోనే పడింది. లోథి రోడ్, మౌసమ్ భవన్‌లో 19.28 సెం.మీ., రిడ్జ్‌లో 15.04 సెం.మీ., పాలంలో 10.66 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అశోకా రోడ్, ఫిరోజ్ షా రోడ్, కన్నాట్ ప్లేస్‌లో పలు రహదారులు జలమయం కాగా కొన్ని అండర్‌పాసలను మూసివేశారు. గోవింపురి, తీన్‌మూర్తి మార్గ్‌లో వరద భారీగా చేరింది. నోయిడాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వాన ముంచెత్తడంతో స్థానికులు నడుము లోతు నీటిలో నడుస్తూ కనిపించారు. ఢిల్లీ ప్రభుత్వం అత్యవసర సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించింది. మరోవైపు శుక్రవారం ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-1 డిపార్చర్ ప్రాంతంలోని పైకప్పు కొంత భాగం కూలి.. కింద ఉన్న ట్యాక్సీలు, కార్లపై పడింది. దీంతో ట్యాక్సీ డ్రైవర్ రమేష్‌కుమార్ (45) మృతిచెందాడు. ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ టెర్మినల్ నుంచి ఇండిగో, స్పైస్ జెట్ దేశీయ సర్వీసులను నడుపుతున్నాయి. పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయానికి వచ్చి ప్రమాదంపె పరిస్థితిని పర్యవేక్షించారు. విమానాశ్రయానికి దగ్గర్లోని వసంత్ విహార్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న గోడ కూలడంతో పలువురు కార్మికులను అక్కడినుంచి తరలించారు. కాగా, మురుగు కాల్వలు, నాలాల్లో చెత్త తరలించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ ఢిల్లీ బీజేపీ కౌన్సిలర్ రవీందర్ సింగ్ నేగి.. వరదలో బోటు వేసుకుని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మథుర రోడ్‌లోని మంత్రి అతిశీ ఇంట్లోకి నీరు చేరిన ఫొటోలను బీజేపీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. కిషన్‌గంజ్‌లోని కొడియా బ్రిడ్జి అండర్ పాస్ వద్ద ఓ బస్సు వరదలో చిక్కుకుంది. రెస్క్యూసిబ్బంది వచ్చి లైఫ్ జాకెట్లు అందించి, తాడుతో ప్రయాణికులను రక్షించారు.

# అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్ 28:**

తనకు రాజకీయాలకన్నా నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. అధికార పార్టీలో ఉంటే నిధులు తెచ్చుకుని అభివృద్ధి చేసుకోవచ్చన్న ఆలోచనతోనే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. అధికారంలో ఉంటే వెసులబాటు తెలియంది కాదన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు.

అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయాక, పార్లమెంట్ ఎన్నికల్లో పరువు నిలబెట్టుకుందామనుకున్న బీఆర్ఎస్‌కు అడుగడుగునా ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత గెలిచిన ఎమ్మెల్యేలను నిలబెట్టుకోలేకపోవడం.. లోక్‌సభ ఎన్నికల ముందు సిట్టింగ్ ఎంపీలే జంప్ అవ్వడం, టికెట్ దక్కించుకున్న తర్వాత ఊహించని రీతిలో ఝలక్ ఇచ్చేసి కాంగ్రెస్‌లో చేరి పోటీ చేయడం గమనార్హం. ఈ షాక్‌ల నుంచి తేరుకోకముందే వరుసగా నలుగురు ఎమ్మెల్యేలు ఈ మధ్య కాలంలోనే బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పేయడంతో కారు పార్టీ కంగుతిన్నది. ఇలా ఒక్కొక్కరుగా 'కారు' దిగుతుండగా.. తాజాగా చేవెళ్ల నుంచి వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన కాలె యాదయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, టి. కాంగ్రెస్ ఇంచార్జ్ దీపా దాస్ మున్షీల సమక్షంలో ఈ చేరిక జరిగింది. కాంగ్రెస్ కండువా కప్పిన రేవంత్.. యాదయ్యను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మరోవైపు.. త్వరలో మరికొన్ని చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కాలె యాదయ్య.. కాంగ్రెస్ పార్టీతోనే తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎంపీపీ, జడ్పీటీసీగా పనిచేసిన ఆయన.. తొలిసారి 2009 ఎన్నికల్లో

ఎస్సీ రిజర్వ్డ్ స్థానమైన చేవెళ్ల నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. టీడీపీ తరఫున పోటీచేసిన కోరాని సాయన్న రత్నం గెలిచి.. ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. 2014 ఎన్నికల్లో పార్టీ మారిన ఇదే ప్రత్యర్థిపైనే.. యాదయ్య పోటీచేసి 781 ఓట్ల మెజార్టీతో తొలిసారి గెలుపొందారు. టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో కొద్దిరోజుల్లోనే గులాబీ కండువా కప్పేసుకున్నారు. ఇక 2018 ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరఫున పోటీచేసి 33,552 మెజార్టీతో గెలిచారు. 2023 ఎన్నికల్లో మాత్రం ప్రత్యర్థి పామేని భీమ్ భరత్ కాంగ్రెస్ నుంచి పోటీచేయగా.. సాయన్న బీజేపీ నుంచి పోటీచేశారు. అయినా సరే ఈ ఇద్దర్నీ ఓడించి అతి తక్కువ 268 ఓట్ల మెజార్టీతో గ్గటెక్కారు. దీంతో వరుసగా గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యే అయ్యారు యాదయ్య. ఈయన రాకతో కాంగ్రెస్ శ్రేణులు, నేతలు హ్యాపీగా ఫీలవుతున్నారు. ఈ చేరికపై ఈయన ప్రత్యర్థి భీమ్ భరత్ మాత్రం ఇంతవరకూ ఎక్కడా స్పందించలేదు.

# నేడు వరంగల్‌లో రేవంత్ పర్యటన

**నేటి ఫోకస్ న్యూస్, వరంగల్, జూన్ 28:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించనున్నారు. శనివారం ఉదయం ఢిల్లీ నుంచి బయలుదేరి.. మధ్యాహ్నం 12.40 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటలోని మెగా టెక్స్‌టైల్ పార్కుకు చేరుకోనున్నారు. మెగా టెక్స్‌టైల్ పార్కుకు సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించి, ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటలకు వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి 2.45 గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకుని మహిళ శక్తి క్యాంటీన్లను ప్రారంభిస్తారు. 3 గంటలకు కలెక్టరేట్‌లో వరంగల్ మహానగర అభివృద్ధిపై మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఈ సమీక్షలో ప్రధానంగా మామునూరు ఎయిర్‌పోర్టు, వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యం తదితర పనులపై చర్చిస్తారు. సాయంత్రం 5.40 గంటలకు హంటర్ రోడ్డులో నూతనంగా నిర్మితమైన మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సహా ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. కార్యక్రమాలు పూర్తయిన అనంతరం సాయంత్రం 6.10 గంటల తరువాత వాతావరణ అనుకూలతనుబట్టి రేవంత్‌రెడ్డి వరంగల్ నుంచి హెలికాప్టర్‌లోగానీ లేదంటే రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

# ఘోర ప్రమాదం

**నేటి ఫోకస్ న్యూస్, షాద్‌నగర్-జూన్ 28:**

గ్లాస్ తయారీ పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, 13 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని బూర్గుల గ్రామశివారులో వాహనాలకు సంబంధించిన గ్లాస్ అద్దాలను తయారుచేసే సౌత్ గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమలో వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది కార్మికులు పని చేస్తున్నారు. శు క్రవారం సాయంత్రం పరిశ్రమలోని ఆటో క్లేవ్ యూనిట్‌లో అద్దాలను గ్యాస్, వేడితో అతికించి, బాయిలర్ నుంచి బయటకు తీసే క్రమంలో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో ఆటో క్లేవ్ యూనిట్ వద్ద ఐదుగురు కార్మికులు పనిచేస్తున్నారు. యూనిట్‌లో తయారైన గ్లాస్‌ను బయటకు తీసే క్రమంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో కార్మికులు తీవ్రంగా గాయపడి మృత్యువాత పడ్డారు. ఈ పేలుడుతో మృతుల శరీరభాగాలు చెల్లాచెదురుగా సుమారు వంద మీటర్ల దూరం వరకు ఎగిరి పడ్డాయి. ఓ కార్మికుడి మృతదేహం పరిశ్రమ షెడ్డు రేకులను చీల్చుకొని బయటకు ఎగిరిపడింది. మరో కార్మికుడి మృతదేహం పూర్తిగా యంత్రంలో ఇరుక్కుపోయింది. ముగ్గురి మృతదేహాలు ఏమాత్రం గుర్తుపట్టలేని విధంగా సుమారు వంద మీటర్ల దూరంలో ఎగిరిపడ్డాయి. శరీరాల నుంచి కాళ్లు, చేతులు, తల, తదితర భాగాలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. మృతి చెందినవారిలో బిహార్ రాష్ట్రానికి చెందిన చిత్తరంజన్ (25), రాంఆశిష్ (18), రవుకాంత్ (25), రోషన్ (36), రతన్ దేవరియా (30) ఉన్నారు. వీరితోపాటు బిహార్‌కు చెందిన గోవింద్, మంటు, సమీద్‌కుమార్, రోషన్‌కుమార్, సురేంద్ర పాశ్వాన్, జారండ్‌కు చెందిన మైకేల్ ఎంబ్రామ్, కార్తీక్, సుకోద్, బూర్గుల గ్రామానికి చెందిన పుల్లని సుజాత, కాశిరెడ్డిగూడకు చెందిన నీలమ్మ, మమత, ఒడిశాకు చెందిన రేతికాంత్, రాజేశ్‌లు తీవ్రంగా గాయపడినట్టు అధికారులు తెలిపారు.

**ప్రమాద ఘటనపై సీఎం ఆరా..**

ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ఢిల్లీలో ఉన్న ఆయన వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి తగిన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, కార్మిక, పరిశ్రమల శాఖ అధికారులు, వైద్య బృందాలు ఘటనాస్థలిలోనే ఉండి సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరం చేయాలన్నారు. దీంతో కలెక్టర్ శశాంక, శంషాబాద్ డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, ఆర్డీఓ వెంకటమాధవరావులు ఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు.

## పివికి సిఎం రేవంత్ నివాళి
### మంత్రులు భట్టి, ఉత్తమ్ కూడా శ్రద్ధాంజలి

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్28:**

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పి.వి. చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకు దక్కుతుందని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పి.వి. చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి పి.వి. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇదిలావుంటే పీవీ స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం పనిచేస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పీవీ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, గడ్డం వంశీకృష్ణ, జైవీర్ రెడ్డి, చామల కిరణ్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ వంశీకృష్ణ.. దేశ అభ్యున్నతికి పీవీ సంస్కరణలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. పీవీ నరసింహారావు కేబినెట్ లో కాకా కేంద్రమంత్రిగా దేశాభివృద్ధిలో భాగం అయ్యారని తెలిపారు. ఆ రోజుల్లో ప్రతిపక్షాలు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చేవారని..ఇపుడు స్పీకర్ ఓం బిర్లా నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేలా స్పీకర్ చర్యలున్నాయన్నారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు పార్లమెంట్ లో కొట్లాడుతామన్నారు  ఎంపీ  వంశీకృష్ణ. నీట్ పేపర్ లికేజ్ పై చర్చ చేపట్టాలంటూ విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్ చేస్తూ లోక్ సభ వెల్ లో ఆందోళనలు  చేశామన్నారు.దేశం అత్యంత క్లిష్ట సమయంలో ఉన్న దశలో దేశానికి ఒక దిశను చూపించిన వ్యక్తి పీవీ నరసింహారావు అని ఎంపీ మల్లు రవి అన్నారు.  ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ తో కలిసి వ్యవస్థను గాడిలో పెట్టి, సంస్కరణలను అమలు చేసి భారత్ ను ప్రపంచ దేశాల సరసన నిలిపారన్నారు. ఆయనతో పనిచేసే అవకాశం  దక్కడం తన అదృష్టమన్నారు.

# నీట్‌పై దద్దరిల్లిన పార్లమెంటు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ, జూన్ 28:**

నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటు ఉభయసభలు శుక్రవారం దద్దరిల్లాయి. నీట్‌పై సమగ్ర చర్చను చేపట్టాలన్న తమ డిమాండ్‌కు అధికారపక్షం అంగీకరించకపోవటంతో ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై తొలుత చర్చిద్దామని, ఆ సందర్భంగా నీట్‌పైనా చర్చ జరపవచ్చన్న ప్రభుత్వ సూచన కు విపక్షాలు అంగీకరించలేదు. దీంతో ఉభయసభల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఫలితంగా పలు మార్లు వాయిదా పడ్డాయి. ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే.. నీట్‌తోపాటు ఇతర పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకైన ఘటనలపై చర్చను కోరుతూ కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇతర కార్యకలాపాలను రద్దు చేసి పేపర్ లీకేజీలపై చర్చను చేపడదామని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ.. ఇటీవల దివంగతులైన 13 మంది మాజీ ఎంపీలకు తొలుత నివాళి అర్పిద్దామన్నారు. నివాళి ముగియగానే విపక్ష ఎంపీలు మళ్లీ తమ డిమాండ్‌ను కొనసాగించారు. నీట్ చాలా ముఖ్యమైన అంశమని, దానిపై చర్చ అవసరమని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరపాలని ఇప్పటికే నిర్ణయించామని, ఆ చర్చలోనే అన్ని అంశాలనూ లేవనెత్తవచ్చని, తగిన సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ముందే మరో అంశంపై చర్చిద్దామని విపక్షం కోరటం గతంలో ఎన్నడూ జరగలేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు అన్నారు. సభలో ప్రతిష్టంభన నేపథ్యంలో స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇటువంటి గందరగోళమే నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చను పక్కనపెట్టి, ముందుగా నీట్‌పై చర్చిద్దామని విపక్షాలు డిమాండ్ చేశాయి. విపక్ష నేత ఖర్గే వెల్‌లోకి రావటం తనను తీవ్రం గా బాధించిందని ధన్‌కడ్ పేర్కొన్నారు. కాగా, నిరసన సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ఫూలో దేవినేతమ్ కళ్లు తిరిగి పడిపోయారు. ఆమెను ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందించారు. ఎంపీ బీపీ తీవ్రంగా పెరిగిందని, దాదాపుగా పక్షవాతం వచ్చే స్థాయిలో ఉందని వైద్యులు తెలిపినట్లుగా ఇతర ఎంపీలు వెల్లడించారు.

# ఘనంగా పివి జయంతి

- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నివాళి
- పివి ఘాట్ వద్ద నివాళి అర్పించిన ప్రముఖులు
- తెలంగాణ భవన్‌లో నివాళి అర్పించిన బిఆర్ఎస్ నేతలు
- ఢిల్లీలో నివాళి అర్పించిన మంత్రులు





**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్28:** దివంగత పివి నరసింహారావు జయంతి వేడుకలు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఢిల్లీలోనూ ఘనంగా జరిగాయి. భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి. ఆయన జయంతిని తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ పివి ఘాట్ వద్ద భారత రత్న, దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు 103వ జయంతి వేడుకలు జరిగాయి. పివి ఘాట్ వద్ద పివి కుమార్తె వాణిదేవి, కుమారుడు ప్రభాకర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, కోదండరామ్, హైకోర్టు జడ్జి శ్రావణ్ కుమార్, తదితరలు నివాళులర్పించారు. అసెంబ్లీలో పివి నరసింహరావు చిత్రపటానికి సభాపతి గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులు పివికి నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పివి ఆర్థిక దార్శనికుడని కీర్తించారు. తెలంగాణ భవన్‌లో పివి నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంఎల్సీ వాణీదేవి, ఎంఎల్ఎ జగదీశ్ రెడ్డి, మహమూద్ అలీలు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రత్న దివంగత మాజీ ప్రధాని పి.వి 103 జయంతి సందర్భంగా గాంధీ భవన్‌లో పివి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపి వి. హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగిశెట్టి జగదీష్, అల్లం భాస్కర్, భవాని రెడ్డి, రాపోలు జయ ప్రకాష్, ప్రేమలత అగర్వాల్, లింగం యాదవ్ తదితరులు నివాళులర్పించారు. తెలంగాణ భవన్ లో మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ చిత్రపటం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మహమూద్ అలీ, పీవీ కూతురు ఎమ్మెల్సీ వాణి దేవి , మాలోత్ కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. భారతదేశ చరిత్ర ఉన్నంత కాలం పీవీ చరిత్ర నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. పీవీ నరసింహా రావు గొప్ప సంస్కరణల శీలి అని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా తన కుటుంబానికి చెందిన 800 ఎకరాలను మహనీయులు దారాదత్తం చేశారన్నారు. జైళ్ల శాఖ మంత్రిగా కూడా ఓపెన్ జైల్ విధానంతో సంస్కరణలు చేశారన్నారు. మైనార్టీ ప్రభుత్వాన్ని సైతం పూర్తికాలం సమర్థవంతంగా నడిపారన్నారు. పీవీ గొప్పతనాన్ని గుర్తించి భారత రత్న ప్రకటించిన కేంద్రానికి కేటీఆర్ అభినందనలు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో పివికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పివి దార్శనికత వల్లనే దేశం ఆర్థికంగా ఎదిగిందని అన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి పివి

- నివాళి అర్పించిన మాజీ సిఎం కెసిఆర్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్28:** బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. నాటి ప్రపంచ ఆర్థిక విధానాలకు అనుగుణంగా సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థిక స్థితిని చక్కదిద్దిన దార్శనికుడు, భారతజాతి ముద్దుబిడ్డ పీవీ అని చెప్పారు. తెలంగాణ బిడ్డగా మనందరం గర్వపడాల్సిన పీవీ నరసింహారావు అందించిన స్ఫూర్తి మరువలేనిదని తెలిపారు. కాగా, మౌనమునిగా పేరుగాంచిన పీవీ నరసింహారావు.. దేశానికి ఎనలేని సేవలు చేసినప్పటికీ కాంగ్రెస్ పాలకులు ఆయనను విస్మరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం పీవీకి సముచిత గౌరవాన్నిచ్చింది. ఆయన ఖ్యాతిని యావత్తు దేశానికి, ప్రపంచానికి చాటేందుకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారు. మహనీయుడి చరిత్ర మరుగున పడిపోతున్న తరుణంలో 'పీవీ మన తెలంగాణ ఠీవీ' అంటూ నరసింహారావు ఖ్యాతిని మరోసారి ఎలుగెత్తిచాటారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఏడాది పాటు ఘనంగా శత జయంతి ఉత్సవాలు జరిపింది.





## పివి ఆర్థిక సంస్కరణలే దేశానికి దిక్సూచి..

- నివాళి అర్పించిన ఎపి సిఎం చంద్రబాబు

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-జూన్28:** బహుముఖ ప్రజ్ఞశాలి, అపార మేధావి, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ప్రముఖులు నివాళులర్పించారు. పీవీ నరసింహరావు తెలుగు రాష్ట్రాలకు దేశానికి చేసిన సేవలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్మరించారు. పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. విప్లవాత్మక సంస్కరణలు, సాహసోపేత నిర్ణయాలతో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు పునాదులు వేశారని గుర్తుచేశారు. మాజీ ప్రధాని పీవీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు అంజలి ఘటించారు. రాష్ట్రానికి, దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన గొప్ప మేధావి పీవీ నరసింహ రావు. భూ స్వామ్య కుటుంబంలో పీవీ జన్మించారు. తనకు గల 1200 ఎకరాల్లో 1000 ఎకరాలను పేదలకు పంచారు. పీవీ నరసింహ రావు అమలు చేసిన భూ సంస్కరణలతో రైతు కూలీలకు భూమి దక్కిందని చెప్పొచ్చు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా, కేంద్ర విద్యాశాఖ మంత్రిగా కూడా పనిచేశారు. ఏపీ సీఎం పదవి చేపట్టి భూ సంస్కరణలను అమలు చేశారు. పదవి చేపట్టిన వన్నె తీసుకొచ్చారు. పీవీ విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో గురుకుల విద్యను ప్రవేశపెట్టారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నవోదయ పాఠశాలలను ప్రారంభించారు. జైళ్ల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఓపెన్ జైల్ అనే పద్ధతికి శ్రీకారం చుట్టారు. సీఎంగా భూ సంస్కరణలు, ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను అమలు చేశారు.



## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన జడ్పిటిసి ఇరుగు మంగమ్మ వెంకటయ్య

**నేటి ఫోకస్ న్యూస్, వేములపల్లి-జూన్ 28:** 15వ ఫైనాన్స్ నిధుల నుండి వేములపల్లి మండల పరిధిలోని కామేపల్లి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి 6,00,000 రూపాయలు మరియు మంచినీటి సౌకర్యనికి 4,60,000 రూపాయలు వైకుంఠ దామనికి మోటర్ పైప్ లైన్ కి 2,00,000 రూపాయలు లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వేములపల్లి జడ్పిటిసి ఇరుగు మంగమ్మ వెంకటయ్య శుక్రవారం అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో వేములపల్లి మండల వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధన ,మాజీ సర్పంచ్ రామ చంద్రయ్య ,గురువయ్య ,నరబోయిన నాగయ్య వార్డ్ నంబర్ లు తమ్మిషెట్టి నగేష్,హుసేన్, నిమ్మల శంకర్ మరియు గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులలో నాణ్యత పాటించాలి

### - కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**నేటి ఫోకస్ న్యూస్, ఉప్పల్ జూన్ 28:** ఓల్డ్ భరత్ నగర్ కాలనీలోని ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. కాలనీలో జరుగుతున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు సిసి రోడ్డు పనులలో నాణ్యత పాటించాలి సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఏ ఈ వసంత, గౌరిగే కృష్ణ, ఈగ అంజయ్య, ఈగ శ్రీను, సంతోష్, ఈగ శంకర్, సల్ల ప్రభాకర్ రెడ్డి, ఈగ మురళి, భాస్కర్ రెడ్డి, నవీన్ గౌడ్, హరిబాబు, జితేందర్ రెడ్డి, నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## టీచర్లల బదిలీతో విద్యార్థుల్లో ఉద్వేగం

### - కన్నీరు మున్నీరయిన పిల్లలు

**నేటి ఫోకస్ న్యూస్, నల్లగొండ-జూన్ 28:** ఉపాధ్యాయులతో పిల్లల అనుబంధం విడదీయరానిది. బదిలీపై వెళ్లినప్పుడు అక్కడున్న వారంతా బదిలీపై వెళుతున్న అధికారులను చూసి బాధపడుతుంటారు. కొందరు వెళ్లొద్దంటూ వేడుకొంటూ ఉంటారు. తాజాగా ఇటువంటి అనుభవమే కొందరు ఉపాధ్యాయుల కు తెలంగాణలో ఎదురైంది. ఇన్నాళ్లు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన ఆ ఉపాధ్యాయులు బదిలీపై వెళుతుంటే.. పదుల సంఖ్యలో విద్యార్థులు వారి చుట్టూ చేరి వెళ్ళొద్దంటూ వేడుకున్నారు. తెలంగాణలోని రెండు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఈ ఘటనలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ మారాయి. దీనికి సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమల్ల జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా సైదులు గడిచిన 14 ఏళ్లుగా పని చేస్తున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పడంలో టీచర్ గా కాకుండా స్నేహితుడిగా వ్యవహరిస్తూ వచ్చిన ఉపాధ్యా యుడు విద్యార్థులకు ఆప్తుడిగా మారిపోయారు. ఆ టీచర్ ఎప్పుడు రాకపోయినా ఆ విద్యార్థులు మనసు కలత చెందుతూ ఉంటుంది. అటువంటి ఉపాధ్యాయులకు కొద్ది రోజుల కిందట బదిలీ అయింది. ఆ మాస్టారు ఇకపై రారని తెలుసుకున్న విద్యార్థులు కన్నీరు మున్నీరుగా వినిపించారు. బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేందుకు ఉపాధ్యాయుడు సిద్ధమవుతుండగా తమను వదిలి వెళ్ళవద్దు అంటూ ఉపాధ్యాయుడిని పట్టుకుని విద్యార్థులంతా ఏడ్చారు. అంతేకాకుండా పదుల సంఖ్యలో విద్యార్థులు ఉపాధ్యాయుడు కాళ్ళ మీద పడి మరి బోరున విలపించారు. మీరు ఇక్కడే ఉండాలి మాస్టారు అంటూ విలపించారు. ఉపాధ్యాయుడు సైదులు వెళ్లడాన్ని విద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. అయినా, సరే మాస్టారు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో.. విద్యార్థులు ఉపాధ్యాయుడు సైదులుకు ఘనంగా వీడ్కోలు పలికారు. సరిగ్గా ఇటువంటి ఘటనే జనగామ జిల్లాలోనూ చోటుచేసుకుంది. జనగామ జిల్లా శామీర్‌పేట ప్రాథమిక పాఠశాలలో సుధీర్ అనే ఉపాధ్యాయుడు గత కొన్నాళ్ల నుంచి పని చేస్తున్నారు. ఆయనకు తాజాగా మరోచోటకు బదిలీ అయింది. సుధీర్ మాస్టారు బదిలీపై వెళుతున్న విషయం తెలుసుకున్న విద్యార్థులు గేటుకు అడ్డుగా నిలబడి వెళ్ళవద్దు అంటూ మాస్టారును వేడుకున్నారు. మీరు ఇక్కడే ఉండాలి మాస్టారు అంటూ మాస్టారుకు విజ్ఞప్తి చేశారు. కన్నీటి పర్యంతమై అడ్డుకోవడానికి ప్రయత్నించిన విద్యార్థులను చూసి సుదీర్ మాస్టర్ కళ్ళల్లో కూడా నీళ్లు తిరిగాయి. మళ్లీ వస్తానంటూ విద్యార్థులకు ధైర్యం చెప్పి ఆయన బయలుదేరి వెళ్లారు. మాస్టారు వెళ్లిన తర్వాత కూడా విద్యార్థులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు చూసిన స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు.

## చంద్రబాబుతో తెలంగాణ గవర్నర్ భేటీ

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-జూన్ 28:** ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ శుక్రవారం భేటీ అయ్యారు. ఉండవల్లిలోని ఆయన నివాసానికి వచ్చిన గవర్నర్‌కు చంద్రబాబు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు, పెండింగ్ అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. వీరి భేటీకి ముందు మంత్రి నారా లోకేశ్ గవర్నర్‌కు స్వాగతం పలికి.. శాలువాతో సత్కరించారు. అంతకుముందు గన్నవరం విమానాశ్రయం చేరుకున్న గవర్నర్‌కు.. విమానాశ్రయంలో అధికారులు ఘన స్వాగతం పలికారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

### - ఆగివున్న లారీని ఢీకొన్న మినీ బస్సు
### - ప్రమాదంలో 13మంది అక్కికక్కడే మృతి

**నేటి ఫోకస్ న్యూస్, బెంగళూరు-జూన్28:** కర్నాటక రాష్ట్రం హవేరి జిల్లాలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుండెనహల్లి శివారులోని పుణె-బెంగళూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మినీ బస్సు ఢీకొట్టడంతో 13 మంది చనిపోయారు. నలుగురు గాయపడడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకాలోని ఈమ్మహట్టి గ్రామానికి చెందిన 17 మంది భక్తులు బెళగావి ప్రాంతం శవదత్తిలోని ఎల్లమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## బాసర ప్రసాదాల విక్రయంలో చేతివాటం

**నేటి ఫోకస్ న్యూస్, నిర్మల్-జూన్28:** గుడిని గుడిలో లింగాన్ని మింగేస్తారంటే ఏమో అనుకున్నాం. కానీ కొన్ని సందర్భాల్లో అది మన కళ్లెదుట స్పష్టంగా తేటతెల్లమవుతూ ఉంటుంది. బాసర జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో కాదేదీ అవినీతి, అక్రమాలకు అనర్హం అన్నట్టుగా.. ప్రసాదాల విక్రయంలో సిబ్బంది చేతి వాటం ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. విషయాన్ని గమనించిన భక్తులు ఆలయ ఈవోకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టించారు. ఈ విషయమై ఈవో విజయరామారావు విచారణ జరుపుతున్నారు. అమ్మవారి ప్రసాదంలో చేతివాటం ప్రదర్శించడంపై భక్తులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.దేశంలోనే పేరుగాంచిన సరస్వతీ దేవి ఆలయాల్లో బాసర ఒకటి. గత ఏడాది బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో ప్రసాదం లడ్డూలు పాడయ్యాయని భక్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.



## పర్యావరణ పరిరక్షణ కోసం కృష్ణ సాగర్ పాదయాత్ర స్ఫూర్తిదాయకం..

- జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి
- వనపర్తి పశు వైద్య కేంద్రంలో మొక్కలు నాటిన వెంకటేశ్వర రెడ్డి


**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** పర్యావరణ పరిరక్షణ కోసం జిల్లా కేంద్రానికి చెందిన సాగర్ స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షులు, (హోంగార్డు) కృష్ణ సాగర్ అలంపూర్ నుంచి హైదరాబాద్ కు చేపట్టిన పాదయాత్ర ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. కృష్ణ సాగర్ చేపట్టిన పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ జిల్లా పశు వైద్యశాలలో స్థానిక వైద్యులు డాక్టర్ మల్లేష్ యాదవ్ తో కలిసి మొక్కలు నాటారు. కృష్ణ సాగర్ చేపట్టిన పాదయాత్రతో ఉమ్మడి జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున స్పందిస్తూ రోడ్డు పొడవునా మొక్కలు నాటడమే కాకుండా ప్రతి గ్రామంలో ఆయనకు మద్దతుగా మొక్కలు నాటుతున్నారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వేదవతి సిబ్బంది స్వప్న లత ఉషా రావు తదితరులు పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ స్కూల్ ఎంపికకు ముగిసిన దారుఢ్య పరీక్షలు

### - డివైఎస్ఓ సుధీర్ కుమార్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఎంపికకు నిర్వహించిన దారుఢ్య పరీక్షలు ముగిశాయని జిల్లా క్రీడాధికారి సుధీర్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ నాలుగవ తరగతి ప్రవేశానికి ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు వనపర్తి జిల్లా జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి 50 మంది బాల బాలికలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వారికి మెడిసిన్ త్రోబాల్ తో వర్టికల్ జంప్, ఫ్లెక్సీబిలిటీ టెస్ట్, షటిల్ రన్, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, ఎత్తు, బరువు వంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్జిఎఫ్ జిల్లా సెక్రటరీ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలిని మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూన్ 28:** జిహెచ్ఎంసి నూతన కమిషనర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారి ఆమ్రపాలి కాటని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి శేఖర్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, హెచ్ బి కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వరరావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయి జన్ శేఖర్, ఆకుల మహేందర్, నవీన్ గౌడ్, మహేష్ గౌడ్, జట్ట కిషోర్, సుక్క కిరణ్, నిరంజన్ చారి, కంచర్ల సోమిరెడ్డి, కాలేరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సినీ పతాకను రెపరెపలాడించిన కల్కి..

## - నటుడు చిరంజీవి ప్రశంసల వర్షం.. - నన్ను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లింది: రాజమౌళి



ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రంపై సినీ సెలబ్రిటీలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నాగ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చి సూపర్‌హిట్ టాక్ తెచ్చుకొంది. తాజాగా మెగాస్టార్, చిరంజీవి , రాజమౌళి ఈ చిత్ర బృందాన్ని సోషల్ మీడియాలో అభినందించారు. ఈ మేరకు చిరు ట్వీట్ చేశారు. 'కల్కి గురించి అన్ని చోట్ల చక్కని స్పందన వినిపిస్తోంది. నాగ్ అశ్విను మైథాలజీ, సైంటిఫిక్ జానర్ కథను ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపికా వంటి భారీ క్యాస్టింగ్‌తో అద్భుతంగా తెరకెక్కించారు. నా అభిమాన నిర్మాతలు అశ్వినీదత్, ప్రియాంక, స్వప్నాలకు అభినందనలు. ప్యాషన్, కరేజ్‌తో టీమంతా సాధించిన సక్సెస్ ఇది. మన సినిమాలు భారతీయ జెండాను మరింత ఎత్తున రెపరెపలాడేలా చేస్తున్నాయని అన్నారు. రాజమౌళి సినిమా గురించి ట్వీట్‌లో రివ్యూ ఇచ్చారు. 'కల్కి' మూవీలో కొత్త ప్రపంచం నిర్మాణాన్ని ఇష్టపడ్డా. అద్భుతమైన సెట్టింగ్‌లతో ఇది నన్ను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లింది. డార్లింగ్ తన టైమింగ్, టాలెంట్‌తో చంపేశాడు. అమితాబ్ జీ, కమల్ సర్, దీపిక నుంచి ఫుల్ సపోర్ట్ దొరికింది. అయితే సినిమా చివరి 30 నిమిషాలు నన్ను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. తమ ఎ÷-లాన్‌ను అమలు చేయడంలో వందశాతం ప్రయత్నం సక్సెస్ సాధించారు. నాగి, అలాగే మొత్తం వైజయంతి టీమ్‌కు అభినందనలు' అంటూ పోస్ట్ చేశారు. ప్రభాస్ పెద్దమ్మ శ్యామలా దేవి ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. 1000 రెబల్ స్టార్‌లను కలిపితే అది ప్రభాసః అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఐమాక్స్‌లో సినిమాను వీక్షించిన ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సినిమాని ఆదరించిన పవన్ కల్యాణ్ ఫ్యాన్స్, ఇతర హీరోల ఫ్యాన్స్, మా కుటుంబ అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ చిత్రంలో ÷ట్లు మరో స్థాయిలో ఉన్నాయి. వాటి గురించి చెప్పేందుకు మాటల్లేవ్' అంటూ ఆనందం వ్యక్తం చేశారు.




# సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసిన సత్యభామ..



సుమన్ చిక్కాల దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ పోలీసు ఆఫీసర్‌గా నటించిన చిత్రం 'సత్యభామ' క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందిన ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి మెప్పించింది. ఇప్పుడీ సినిమా సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అలరిస్తోంది. నవీన్‌చంద్ర కీలకపాత్రలో కనిపించిన ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్, రవి వర్మ, తదితరులు నటించారు. కె.సత్యభామ షీ టీమ్‌లో ఏసీపీ స్థాయిలో పనిచేస్తుంటారు. చూడటానికి శాంతంగా కనిపించినా, నేరస్థుల నుంచి నిజాలు రాబట్టడంలో దిట్ట. తనకు అప్పజెప్పిన కేసుల్ని అంత సులభంగా వదిలిపెట్టదని పేరు. రచయిత అమరేందర్ (నవీన్‌చంద్ర)ని ఇష్టపడి పెళ్లి చేసుకున్న ఆమె వ్యక్తిగత జీవితానికంటే, వృత్తికే ఎక్కువ సమయం కేటాయిస్తుంటుంది. షీ టీమ్‌లో పనిచేస్తున్నప్పుడే హసీనా అనే ఓ బాధితురాలు గృహహింసని అనుభవిస్తూ సాయం కోసం సత్యభామ దగ్గరికి వస్తుంది. ఆ తర్వాత హసీనా తన భర్త చేతిలో దారుణ హత్యకి గురవుతుంది. హసీనాతోపాటు, ఎంతోమంది జీవితాలతో ఆడుకున్న ఆ నేరస్థుడిని పట్టుకునే క్రమంలో సత్యభామకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఆ కేసుని ఆమె వ్యక్తిగతంగా తీసుకోవడానికి కారణమేమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# అండమాన్‌లో సూర్య, పూజా హెగ్డేలపై చిత్రీకరణ

కథానాయకుడు సూర్య ప్రస్తుతం తన 44వ చిత్రంతో సెట్స్‌పై బిజీగా ఉన్నారు. కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాని 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, స్టోన్‌బెంచ్ ఫిల్మ్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పూజా హెగ్డే కథానాయిక. ఈ చిత్ర తొలి



షెడ్యూల్ కొన్నాళ్ల క్రితమే అండమాన్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇప్పుడిది ముగింపు దశకు చేరుకుంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ఇప్పటికే సూర్య, పూజలపై రెండు పాటలు చిత్రీకరించినట్లు సమాచారం. అలాగే సూర్యపై ఓ యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కించినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారని.. జులై తొలి వారాంతానికి ఈ షెడ్యూల్ పూర్తవుతుందని తెలుస్తోంది. ఇక రెండవ షెడ్యూల్‌ను జులైలోనే ఊటీలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు వార్తలొస్తున్నాయి. ప్రేమ, యాక్షన్, వినోదాల మేళవింపుతో ఉన్న ఓ ఆసక్తికర కథతో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకి సంతోష్ నారాయణన్ సంగీతమందిస్తున్నారు.

# సేనాపతి వయసుపై సందేహాలు..

## అది ముఖ్యం కాదన్న దర్శకుడు శంకర్



కమల్ హాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఫిల్మ్ 'భారతీయుడు2' 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 12న తమిళ, తెలుగు భాషలతో పాటు, ఇతర భారతీయ భాషల్లోనూ విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌పై అంచనాలను పెంచింది. అయితే, వృద్ధుడైన సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ స్టంట్స్ చేయడంపై సామాజిక మాధ్యమాల వేదికగా చర్చ నడుస్తోంది. ఎందుకంటే 'భారతీయుడు' చిత్రం జరిగే సమయానికి సేనాపతి పాత్రకు వయసు 75ఏళ్లుగా చూపించారు. ఆ లెక్క ప్రకారం 2024కు వచ్చే సరికి ఆ పాత్ర వయసు 103 సంవత్సరాలు. అంత వయసున్న వృద్ధుడు మార్షల్ ఆర్ట్స్ ఫైట్స్ చేయడం సాధ్యమేనా?అన్న ప్రశ్న దర్శకుడు శంకర్‌కు ఎదురైంది. దీనికి వివరణ ఇస్తూ సేనాపతి సాధారణ వ్యక్తిగా చూడొద్దని, సూపర్‌హీరోగా చూడాలంటూ సమాధానం ఇచ్చారు. 'సేనాపతి వృద్ధుడే కావచ్చు కానీ, సూపర్‌మ్యాన్. ఈ ప్రశ్న నన్ను చాలా మంది అడిగారు. నేను ఫస్ట్ పార్ట్ చేసినప్పుడు సీక్వెల్ గురించి ఆలోచనే లేదు. కేవలం ఆ ఒక్క చిత్రమే అనుకున్నా. అందుకు తగినట్లుగానే దాన్ని రాసుకున్నా. సేనాపతిని స్వాతంత్య్ర సమరయోధుడిగా చూపించాలనుకున్నా. అందుకే అతడి పుట్టిన సంవత్సరాన్ని అందులో చూపించాం. సేనాపతి గురించి పోలీసులు విచారణ చేసే క్రమంలో అతడు పుట్టిన సంవత్సరం ఏంటో తెలుస్తుంది. ఆ విషయం నాకు గుర్తు లేదు. ప్రస్తుతం సేనాపతి చైనాలో మార్షల్ ఆర్ట్స్ ఫైటర్‌గా కనిపిస్తాడు. అత్యధిక వయసు కలిగిన మార్షల్ ఆర్ట్స్ ఫైటర్స్ అక్కడ ఉన్నారు. జిజియన్ అనే ఫైటర్ వయసు 108 సంవత్సరాలు. ఇప్పటికీ ఆయన యాక్టివ్‌గా ఉన్నారు. గాల్లో ఎగురుతూ కిక్ కూడా కొట్టగలరు. అది వారికున్న క్రమశిక్షణ, సాధన వల్ల సాధ్యమైంది. సేనాపతి కూడా అలాంటి వాడే. మర్మకళలో అతడు మాస్టర్. అందుకే నేను అతడిని సూపర్‌హీరోగా చూస్తా' అని శంకర్ చెప్పుకొచ్చారు. 'భారతీయుడు' కోసం వేసుకున్నట్లే ప్రోస్థటిక్ మేకప్ వేసుకోవడం విసుగ్గా అనిపించడం లేదా? అని కమల్‌ను ప్రశ్నించగా, 'సినిమా కథ ఆసక్తిగా లేకపోయినా, దర్శకుడు డిమాండ్ చేయకపోయినా అది సాధ్యమయ్యేది కాదు. ఇక ప్రోస్థటిక్ మేకప్‌లు వేసుకోవద్దని చాలా సార్లు అనుకునేవాడిని. కానీ, మంచి చిత్రాలు, కథలు రావటం వల్ల మళ్లీ నేను ఆ దిశగా పయనించాల్సి వస్తోంది' అని కమల్ అన్నారు. 'భారతీయుడు2'లో సిద్దార్థ్, రకుల్‌ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా, దివంగత నటుడు వివేక్, ప్రియా భవానీ శంకర్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

